క్లుప్తంగా

మొదలైన ఎస్‌ఎంసీ ఎన్నికల పక్రియ



ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల ప్రక్రియ మొదలయ్యింది. ఉన్నతాధికారుల షెడ్యూల్ ప్రకారం .. ఎలెక్టెడ్ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్, ఎక్స్ అఫీషియో సభ్యులు, కో-అప్టెడ్ సభ్యులను ఎన్నుకునేందుకు గాను గురువారం పాఠశాలల్లో ఎన్నికల నోటీసును జారీ చేశారు. ఓటర్ల జాబితాలను నోటీసు బోర్డుల్లో ఏర్పాటు చేశారు. ఈ నెల 8వ తేదీన ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నిర్ణీత షెడ్యూల్‌ను, సమయాన్ని పొందుపరుస్తూ హెచ్‌ఎంలు పోస్టర్లను పాఠశాలల్లో అతికించి ఎన్నికల నగారాను మోగించారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్



పొన్నూరు: సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు గురువారం బోనస్ పంపిణీ చేశారు. మునిపల్లె గ్రామ పాల ఉత్పత్తిదారులు 68 మందికి రూ. 2.15 లక్షలు, వెల్లలూరులో 97 మందికి రూ. 1.25 లక్షలు, బ్రాహ్మణ కోడూరు 45 మందికి 40 వేలు, జూపూడి 33 మందికి రూ.14 వేలు, చేబ్రోలు మండలంలోని మంచాల గ్రామంలో 50 మందికి రూ. 96 వేలును డెయిరీ పాలకవర్గ సభ్యులు బి. రామారావు అందించారు. కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, సిబ్బంది, సొసైటీ సిబ్బంది, పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.

భాష్యం బ్లూమ్స్ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన జి. సురేష్

గుంటూరు రూరల్: నగరంలోని కేవీపీ కాలనీకి చెందిన గోసి మహేష్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గురువారం డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ వై.సునందమ్మ పర్యవేక్షణలో డిజైన్ అండ్ సింథసిస్ ఆఫ్ సెనిన్ అండ్ కుమరిన్ బేస్డ్ ఫ్లోరోసెంట్ ప్రోబ్స్ ఫర్ ది డిటెక్షన్ ఆన్ సైనైడ్, కాపర్ అండ్ మెర్క్యూరీ అయాన్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయుడిని అభినందించారు.

బాలిక అదృశ్యం

ప్రత్తిపాడు: మైనర్ బాలిక అదృశ్యమైన ఘటనపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన ప్రకారం ప్రత్తిపాడు మండలం నిమ్మగడ్డవారిపాలెం గ్రామానికి చెందిన పదిహేడు సంవత్సరాల బాలిక పదవ తరగతి వరకూ చదువుకుని ఇంట్లోనే ఉంటుంది. ఈ నెల 31వ తేదీన ఇంట్లో నుంచి కనిపించకుండా వెళ్లిపోయింది. వెతికినా ఫలితం లేకపోవడంతో బాలిక తల్లిదండ్రులు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు తెలిపారు.

యువకుడి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువకుడి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కేవీపీ కాలనీలో నివసించే నిమ్మకాయల భవాని కుమారుడు కోటయ్య (18) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంగళగిరి: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై భారీగా ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన పట్టణంలోని గణపతినగర్‌లో జరిగింది. చిల్లపల్లి నాగేంద్రం అద్దె ఇంట్లో నివసిస్తూ విజయవాడలో బంగారం వ్యాపారం చేస్తున్నారు. ఆయన గురువారం ఉదయం దుకాణానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసే సమయంలో ఏసీ ఆన్ చేయగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయి. దీంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. నాగేంద్రం కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. అగ్నిమాపక యంత్రం వచ్చి మంటల్ని అదుపులోకి తేవడంతో ప్రమాదం తప్పింది. రూ.18 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు నాగేంద్రం తెలిపారు.

రాకాసుల రాజ్యం!

- పొన్నూరు మున్సిపాలిటీలో కాంట్రాక్టర్ల గగ్గోలు
- చేసిన పనులకు బిల్లుల కోసం పడిగాపులు
- రూ.లక్షలు అడుగుతున్నారంటూ అధికారులపై ఆరోపణలు



పొన్నూరు మున్సిపల్ కార్యాలయం

పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. కొందరు అధికారులు కాంట్రాక్టర్లు చేసిన అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తూ ముడుపుల కోసం కాంట్రాక్టర్లను వేధిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులు పూర్తయి 8 నెలలు గడుస్తున్నా బిల్లులు చేయకుండా ఫైల్లు పక్కన పెట్టేశారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఫలితంగా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో లబోదిబోమంటున్నారు. రోజుల తరబడి కార్యాలయ ఆవరణలో పడిగాపులు కాస్తున్నారు. ఆశించిన పైకం ముట్టజెప్పేదాకా బిల్లులు చేయకుండా అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని వాపోతున్నారు. ఎక్కువ మొత్తంలో కమీషన్లు ఆశించి బిల్లులు సీఎఫ్‌ఎంఎస్‌కు పంపలేదని, ఆడిట్ పెండింగ్ ఉందని, ఇంకా పనులు పూర్తికాలేదని, ఎన్నికల సమయంలో కోడ్ ఉందని.. ఇలా అనేక కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు ఎలాగైనా చేసిపెడతాం అని చెప్పిన అధికారులు ధనార్జనే లక్ష్యంగా ప్రస్తుతం కాలాన్ని సాగదీస్తున్నారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

కొత్త పనులకు ససేమిరా

ఇప్పటికే బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. నిడుబ్రోలు రక్షిత మంచినీటి పథకం నుంచి ఫిల్టర్ బెడ్లు మార్చని కారణంగా తాగునీరు పచ్చని రంగులో సరఫరా అవుతోందని స్వయంగా మున్సిపల్ డీఈ ఏడుకొండలు చెబుతున్నారు. అయితే ఈ పనులు చేసే కాంట్రాక్టర్ గతంలో తాను చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు చెల్లించని లేదని, కొత్తగా పని చేసేది లేదని నిరాకరిస్తున్నారు.

పర్సంటేజీ కాదు రూ.లక్షలు అడుగుతున్నారు



గతంలో పర్సంటేజీ లెక్కన కమీషన్ అడిగేవారు. కానీ ఇప్పుడు రూ.లక్షలు ముట్టజెబితేగానీ పని కాదని చెబుతున్నారు. సుమారు రూ. 27 లక్షలు పెండింగ్ పెట్టారు. రోజుల తరబడి బిల్లుల కోసం తిరుగుతున్నాను. మా బిల్లులు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలి.

–శ్రీనివాసరావు, కాంట్రాక్టర్

అన్నీ సక్రమంగా ఉంటేనే బిల్లులు



అభివృద్ధి పనులకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉంటేనే బిల్లులు మంజూరవుతాయి. కాంట్రాక్టర్లు చేసిన కొన్ని పనులు పూర్తికాలేదు. బిల్లులు రావాల్సి ఉంది. ప్రభుత్వం విడుదల చేస్తేనే కాంట్రాక్టర్లకు అందుతాయి. ఎవరి వద్ద కమీషన్లు తీసుకోవడం లేదు. ఎవరికీ కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

–ఏడుకొండలు, మున్సిపల్ డీఈ, పొన్నూరు

జిందాల్ ప్లాంట్‌ను సందర్శించిన కమిషనర్



ప్లాంట్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ హరికృష్ణ

గుంటూరు రూరల్: ఘన వ్యర్థాల నిర్వహణ పటిష్టంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టినప్పుడే రోజువారి ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని నగర కమిషనర్ (ఎఫ్ఏసీ) ఎస్.హరికృష్ణ తెలిపారు. గురువారం రూరల్ మండలంలోని నాయుడుపేటలోగల జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ జిందాల్ ప్రతినిధులతో ప్లాంట్ సామర్థ్యం, అవసరమైన వ్యర్థాలు, ఏ మున్సిపాల్టీల నుంచి ఎంత చెత్త వస్తుంది, ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి నగర పాలక సంస్థ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల నిర్వహణ పెద్ద సమస్యగా ఉందని, ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను ఒక చోట డంప్ చేయడం ద్వారా స్థలాభావ సమస్య కూడా ఎదురవుతుందన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ద్వారా వ్యర్థాల నిర్వహణ తేలికవుతుందన్నారు. అలాగే జిందాల్ ప్లాంట్‌కు ఇతర మున్సిపాలిటీల నుంచి వ్యర్థాలు తరలిస్తున్నా, గుంటూరు నగరపాలక సంస్థ ప్రధానంగా ఉంటుందన్నారు. ప్రజారోగ్య సిబ్బంది గుంటూరు లక్ష్యానికి అనుగుణంగా ప్రతి రోజు 320 టన్నుల వ్యర్థాలను జిందాల్ ప్లాంట్‌కు తరలించాలన్నారు. ఆయనవెంట ఈఈ కొండారెడ్డి, డీఈఈ సతీష్, ఏఈ రవికిరణ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్‌కుమార్, జిందాల్ ప్లాంట్ డీజీఎం ఎస్వీ రాయుడు, సీనియర్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, మేనేజర్ ఎస్.భార్గవ తదితరులు పాల్గొన్నారు.

దళితుల్లోని అన్నివర్గాలకు సమన్యాయం

- సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం
- విలేకరుల సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు
- చినకోండ్రుపాడులో పింఛన్ల పంపిణీ



చినకోండ్రుపాడులో వృద్ధుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు: జనాభాలో 17 శాతం పైగా ఉన్న దళితుల మధ్య ఉన్న అగాథాన్ని పూడ్చేలా.. వారి మధ్య ఉన్న చిన్న చిన్న అరమరికలకు స్వస్తి పలికేలా సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడులో గురువారం ఎమ్మెల్యే బూర్ల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు పింఛను పెంచారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామాంజనేయులు మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు వలన దశాబ్దాలుగా దళితుల మధ్య ఉన్న అపోహలు, పెరిగిన వైషమ్యాలకు ఫుల్‌స్టాప్ పడినట్లయ్యిందన్నారు. దళితుల్లోని 59 కులాల మధ్య ఉన్న ఆర్థిక అసమానతలను సరిచేసే విషయంలో జనాభా ప్రాతిపదికన, రాష్ట్రాల ప్రాతిపదికన రాష్ట్రాలకే అవకాశం ఇస్తూ సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. దళిత వర్గాలు అనైక్యత అనేది లేకుండా అందరూ ఒకే తాటిపై నిలబడి, ప్రజాస్వామ్యంలో వారి సంఖ్యా బలాన్ని బట్టి భవిష్యత్తుకు మంచి పునాదులు వేసుకోవాలని ఆకాంక్షించారు. దేశంలో మొట్టమొదట కేటగిరైజేషన్‌కు మద్దతు ఇచ్చింది ఆనాడు చంద్రబాబు నాయుడేనని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కూడా న్యాయస్థానాల నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. దళితుల మధ్య ఉన్న ఆర్థిక అసమానతలను తొలగించాలని చంద్రబాబు గతంలోనే జీఓ నంబరు 25 తీసుకువచ్చారన్నారు. ఇప్పుడు కూడా దళితుల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు. దళితులకు వారి వారి సంఖ్యను బట్టి వారికి రావలసిన వాటా మేరకు నిధులను విడుదల చేసి, వారిని అభివృద్ధి చేయడం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కె.నాగేశ్వరరావు, వి.సుబ్బారావు, మెరికినపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు: ములుకుదురు గ్రామంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ముందుగా చెన్నకేశవ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- పొన్నూరు పట్టణంలోని 3, 31 వార్డులలో ఉదయం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మెప్మా పీడీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ పర్యవేక్షించారు. పొన్నూరు పట్టణంలో 96.7 శాతం పూర్తయినట్లు పేర్కొన్నారు.

ఏఎన్‌ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండాలి



పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమ కుమారి

కాకుమాను: ప్రస్తుతం గ్రామాలలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఏఎన్‌ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమ కుమారి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రేమకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలలో కొద్దిపాటి వర్షాలు కురుస్తున్నాయని, వీటివలన ప్రజలకు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఏఎన్‌ఎం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారికి కేటాయించిన గృహాలను ప్రతి రోజు సందర్శించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆయా ఇంటిలో చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని ఆమె ఆదేశించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి..

కాకుమాను: మండల స్థాయి అధికారులందరూ ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రడల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమ కుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు.ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఎంఈఓలు కేఎఫ్ కెనడీ, విజయ్ భాస్కర్, ఈవోపీఆర్డి జవహర్‌లాల్ నెహ్రూ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూడు భాషలపై పట్టు సాధించాలి

ప్రత్తిపాడు: విద్యార్థులు మూడు భాషలపైనా పట్టు సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు వారికి పాఠ్యాంశాలు బోధించాలని ఎంఈఓ-2 జి. లీలారాణి అన్నారు. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్నం ఎంఈఓ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని రిజిస్టర్లు తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న పీఎం పోషణ్ (మధ్యాహ్న భోజనం)ను విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యా నైపుణ్యాలను వారితో పాఠ్యాంశాలు చదివించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయ్యే లోపల తెలుగు, హిందీ, ఇంగ్లిషు భాషలు వారికి చదవడం, మాట్లాడటం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు గొడుగులు, పరీక్ష కిట్ల పంపిణీ



గుంటూరు మెడికల్: గుంటూరు హోప్‌విన్ హాస్పిటల్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో హాస్పిటల్స్ చైర్‌పర్సన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా విద్యార్థులకు ఉచితంగా గొడుగులు, పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి ఎంతో కీలకమైందని, ఇందులో సాధించే మార్కుల ఆధారంగా వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు. విద్యార్థులంతా ఎక్కువ మార్కులు సాధించేందుకు కృషి చేయాలని, చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారికి తోడ్పాటు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ నాగేశ్వరరావు, గుంటూరు కోవిడ్ ఫైటర్స్ ట్రస్టు చైర్మన్ పఠాన్ అల్లాబక్షు, పాఠశాల హెడ్‌మాస్టారు బి.రాజీవ్‌రత్న పాల్గొన్నారు.

తల్లిపాలతో శిశువులకు రోగ నిరోధక శక్తి

- గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరీ యునిస్
- తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



గొట్టిపాడు పీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మేరీ యునిస్



ప్రత్తిపాడులో గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పిస్తున్న అడిషనల్ సీడీపీఓ విజయనిర్మల



తల్లి పాల విశిష్టతపై కాకుమానులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు: శిశువులకు తల్లిపాలు తాగించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరీ యునిస్ అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు పీహెచ్‌సీలో గురువారం తల్లిపాల వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ మేరీ యునిస్ ఎంపీహెచ్ఈఓ చెల్లమ్మతో కలిసి పోస్టర్లును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ శిశువుకు ఆరునెలల వరకు తల్లిపాలు తాగించాలని చెప్పారు. తల్లిపాలు తాగడం వలన శిశువుకు జలుబు, జ్వరం వంటివి చాలా తక్కువగా సోకుతాయని, పిల్లలకు వచ్చే లుకేమియా, షుగర్, ఆస్మా, స్థూలకాయం, మానసిక, దంత సమస్యల నివారణలో తల్లిపాల పాత్ర ఎంతో కీలకమన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్ఈఓలు గ్రామాల్లో పర్యటించి తల్లులు, గర్భిణులు, మహిళలకు ప్రత్యేక అవగాహన కల్పిస్తారని చెప్పారు. తల్లిపాలు తాగిన శిశువుల్లో యాంటీబాడీస్ వృద్ధి చెంది ఇన్‌ఫెక్షన్లు, నిమోనియా, డయేరియా వంటి వ్యాధులు సోకవని వివరించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డకు ముర్రుపాలు దివ్యౌషధం..

ప్రత్తిపాడు: బిడ్డకు పుట్టిన గంట లోపలే ముర్రుపాలు అందించాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అడిషనల్ సీడీపీఓ సీహెచ్ విజయనిర్మల అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం నియోజకవర్గ కేంద్రంలోని వడ్డెరపాలెం అంగన్‌వాడీ సెంటరులో తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీడీపీఓ విజయనిర్మల తల్లిపాల ఆవశ్యకతను తల్లులకు వివరించారు. బిడ్డ పుట్టిన గంట లోపల వచ్చే పసుపు రంగు ముర్రుపాలు బిడ్డకు దివ్య ఔషధంలా పనిచేస్తాయని చెప్పారు. ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే శిశువులకు తాగించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎ.నగరాజకుమారి, మహిళలు పాల్గొన్నారు.

- గొట్టిపాడు డీడబ్ల్యూ-2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పాలు పట్టించిన తరువాత బిడ్డ వీపును నిమరడం, త్రేన్పులు వచ్చేవరకు వేచి ఉండటం చేయాలన్నారు. తల్లులు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పి.అంకమ్మరావు, దేవిక, రమా, కుసుమ, తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

కాకుమానులో...

కాకుమాను: తల్లి పాలే శిశువుకి శ్రీరామ రక్ష అని శిశువు జన్మనించిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని కాకుమాను పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రవి ప్రసాద్ అన్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రం కాకుమానులో గురువారం తల్లిపాల వారోత్సవాలపై తల్లులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారిణి ప్రేమ కుమారి, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈవోలు కెనడీ, విజయ్ భాస్కర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకాయమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటకాలు



సత్యహరిశ్చంద్ర నాటకంలోని ఓ దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం రాత్రి పల్నాటి యుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటకాలను ప్రదర్శించారు. తొలుత ఆలయ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సమతా నాటక గురుకుల వ్యవస్థాపక కార్యదర్శి, కందుకూరి వీరేశలింగం అవార్డు గ్రహీత వరయూరి రామానుజసూరి 14వ సంస్మరణ సందర్భంగా పల్నాటి యుద్ధంలోని నాగమ్మ పూజ సీను, మాంచాల సీను, సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. హరిశ్చంద్రగా అమ్మిశెట్టి రంగారావు, హేమంత్‌కుమార్, నక్షత్రకుడిగా జి.వెంకటేశ్వర్లు, చంద్రమతిగా రత్నజ, వీరబాహుడిగా జి.గురునాథం, కాలకౌశికగా బాబూరావు, శిష్యగా శివయ్య, నాగమ్మ పూజ సీను, మాంచాల సీనులో బాలచంద్రగా ఎం.కుమార్‌బాబు, మాంచాలగా లహరి నటించారు. కార్యక్రమాన్ని అమ్మిశెట్టి రంగారావు పర్యవేక్షించారు. చివరిగా కళాకారుల్ని దేవాలయ పాలక మండలి సత్కరించింది.

100 మంది పోలీసులకు కంటి పరీక్షలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మాక్సివిజన్ ఐ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ కోఆర్డినేటర్ ఎ. మునీశ్వర్ మాట్లాడుతూ తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లోని సిబ్బందితో పాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి కూడా కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఇందులో సమస్యలు ఉన్న వారికి విజయవాడలోని మాక్సివిజన్ ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత పరీక్షలు నిర్వహిస్తామని, మిగిలిన వాటికి ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో పాటు దాదాపు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్యులు ఎండీ. అహ్మద్ పాషా, కౌన్సిలర్ ఎం. రాజేశ్వరి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నగర కమిషనర్ హరికృష్ణ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లలో జరుగుతున్న పనుల్ని గురువారం నగర కమిషనర్ ఎస్.హరికృష్ణ పరిశీలించారు.నగరపాలక సంస్థ పరిధిలో చుట్టుగుంట, మిర్చి యార్డ్, నల్లచెరువు, పల్నాడు బస్టాండ్, ఆర్టీవో ఆఫీస్, ఐడీ హాస్పిటల్, బస్టాండ్ ప్రాంతాల్లో క్యాంటీన్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆయన ఆదేశించారు. క్యాంటీన్ పరిసరాలలో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకోవాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలకు అనుగుణంగా, నాణ్యత ప్రమాణాల్లో రాజీ లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎం.శ్యాం సుందర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు రమేష్ బాబు, శ్రీధర్, హనీఫ్, సతీష్, ఏఈలు రాంబాబు, సునీల్ కుమార్, నాగవేణి, సాంబశివరావు, సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరంలో 98శాతం పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నగరంలో గురువారం సాయంత్రానికి 98శాతం పూర్తయిందని కమిషనర్ ఎస్. హరికృష్ణ తెలిపారు. 58,971 మందికి గాను 57,703 మందికి నగదు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల అందుబాటులో లేని 1,268 మందికి శుక్రవారం ఉదయం అందిస్తామని చెప్పారు.

తెగుళ్లపై పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఫిరంగిపురం: ప్రస్తుత వర్షా కాల సీజన్‌లో పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నగేష్ సూచించారు. మండలంలోని రేపూడి, మేరికపూడి, ఫిరంగిపురం గ్రామాల్లోని పత్తి పంటను ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఆకుముడత, పచ్చదోమ నివారణకు ఫిపోనిల్ 2 ఎం.ఎల్. ఒక లీటరు నీటిలోకలిపి వారం వ్యవధిలో అవసరాన్ని బట్టి రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. దానితో పాటు బస్తా డీఏపీ, బస్తా యూరియా, 25 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ను 30రోజుల వయస్సున్న పంటలో వెద పెట్టుకోవాలని సూచించారు. ఆయనతోపాటు విస్తరణ అధికారి సుభాని, గ్రామ సహాయకులు కె.కిరణ్ కుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.